క్లుప్తంగా

సామూహిక హారతి



లక్ష్మీ నరసింహస్వామికి హారతినిస్తున్న భక్తులు

చిల్లకూరు: మండలంలోని కలవకొండపై వెలసిన చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామికి ఆదివారం శుక్ల పక్ష పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక హరతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం ఆలయంలో సమరసతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయంలో సామూహిక హారతి కార్యక్రమం నిర్వహించి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ వెంకటరమణారెడ్డి, జిల్లా మహిళా కన్వీనర్ శివాని, ధర్మప్రచారక్ వెంకటేశ్వర్లు, జిల్లా సాంస్కృతిక కన్వీనర్ టీవీ క్రిష్ణదాసు పాల్గొన్నారు.

వైభవంగా వినాయకుని గ్రామోత్సవం



వినాయకుని గ్రామోత్సవంలో పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, నాయకులు

కోట: స్థానిక దళితవాడలో వినాయకుని నిమజ్జనం సందర్భంగా ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి స్థానికులతో కలసి గ్రామోత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఆయన వెంట పార్టీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాదర్తి రాధాక్రిష్ణారెడ్డి, జరుగుమల్లి ఉప సర్పంచ్ కస్తూరయ్య, వెంకురెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



సుధాకర్‌రెడ్డి(ఫైల్)

దొరవారిసత్రం: మండలంలోని అక్కరపాక పంచాయతీ మాజీ సర్పంచ్ సన్నారెడ్డి సుధాకర్‌రెడ్డి(77) అనారోగ్యంతో హైదబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు.. ఆయన అత్యక్రియలు స్వగ్రామైన అక్కరపాక పంచాయతీ ఎస్ఎం అగ్రహారంలో సోమవారం జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. మృతుడు రెండు సార్లు, సర్పంచ్‌గా, జిల్లా గ్రంథలయం కమిటీ డైరెక్టర్‌గా, నీటి సంఘం అధ్యక్షుడుగా, సూళ్లూరుపేట ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్‌గా పని చేశారు.

మానసదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



అన్నదానం చేస్తున్న చైర్ పర్సన్ దీపిక దంపతులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని అగ్రహారపేటలో వెలసిన మానసదేవి (నాగమాసలమ్మ) ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మణ్ణికి అభిషేకాలు చేసి వేదపండితుల సారథ్యంలో పూజలు నిర్వహించారు. స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ కటక దీపిక, బాలాజి దంపతులు అన్నదానం చేశారు.

అలరించిన నృత్య ప్రదర్శన



సైదాపురం/వెంకటగిరి రూరల్ : గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతరలో భాగంగా ఆదివారం నిర్వహించిన ఘటోత్సవంలో భాగంగా రాత్రి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. మెగా మ్యూజికల్ నైట్‌లో పాప్ సింగర్ గీతామాధురి, అరుణ్ కౌండిల్య, చాగంటి సాహితి, రితేష్‌తోపాటు జబర్దస్త్ నటులు విచ్చేశారు. యువకులు ఈలలు, చప్పట్లు, కేరింతలతో సందడి చేశారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

వాకాడు: మండలంలోని బాలిరెడ్డిపాళెం గ్రామంలో ఉన్న శ్రీ పట్టాభి రామాలయంలో ఆదివారం దాతల సహకారంతో పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. శ్రీ సీతా రామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో దాతలు నాయుడు వెంకటరమణా రెడ్డి కుటుంబ సభ్యులు పేద విద్యార్థులైన ఎంబేటి తనూష్ కుమార్, పలుకూరు లక్ష్మీ గాయత్రికి రూ.10 వేలు చొప్పున అందజేశారు.

చికెన్ ధరలు		08-09-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	120
లేయర్ లైవ్	:	123
బ్రాయిలర్ చికెన్	:	220
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	242
లేయర్ చికెన్	:	210

జనసందోహం మధ్య ఊరేగుతున్న పోలేరమ్మ ఘటములు



పోలీసు బందోబస్తు మధ్య కదులుతున్న అమ్మవారి ఘటములు



అట్టహాసం.. ఘటోత్సవం!

- భక్త జనసందోహం మధ్య కదిలిన పోలేరమ్మ ఘటం
- కిటకిటలాడిన వెంకటగిరి వీధులు
- సంప్రదాయాలకు భిన్నంగా ఆరంభం..
- భక్తులు అడ్డుకోవడంతో వాహనం దిగిన అమ్మవారి ఘటములు

సైదాపురం/వెంకటగిరి రూరల్ : రాష్ట్ర పండుగగా గుర్తింపు పొంది రెండో ఏట పోలేరమ్మ జాతర అట్టహాసంగా అశేష జనసందోహం నడుమ ప్రారంభమైంది. వెంకటగిరి పట్టణ నలుమూలల జన కోలాహలం మధ్య కిటకిటలాడింది. జనాలతో కిక్కిరిసిన ప్రధాన వీధుల్లో పోలేరమ్మ ఘటం కదిలింది. పోలీసు, దేవదాయశాఖ అధికారుల పటిష్ట బందోబస్తు మధ్య సంప్రదాయాలకు భిన్నంగా ఈ సారి ఘటోత్సవం వాహనంలో ఆరంభమైంది. దీన్ని స్థానిక భక్తులు అడ్డుకోవడంతో యథావిధిగా ఘటం కుండలను వాహనం నుంచి దించి నడక మార్గం ద్వారా ఘటోత్సవారం ఆరంభమైంది.

యువత కేరింతలు

పోలేరమ్మతల్లి జాతరలో తొలి ఘట్టం ఘటోత్సవం ఆరంభమైన నేపథ్యంలో పట్టణంలోని యువత, మహిళలు పెద్ద సంఖ్యలో జీనుగులవారి వీధిలోని అమ్మవారి మెట్టినింటి మండపం వద్దకు చేరుకున్నారు. మండపంలో అమ్మవారి ఘటము(కుండ)లకు స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఆలయ అధికారుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ఘటం కదిలి ఆంజనేయ స్వామి దేవస్థానం, బజారు వీధి, పోలేరమ్మతల్లి దేవస్థానం, రాజా ప్యాలెస్ మీదు సాగింది. యువతతోపాటు మహిళలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై కుండలను తాకేందుకు పోటీ పడ్డారు. రాజా ప్యాలెస్‌లో వెనుక భవనం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ యువత అధిక సంఖ్యలో చేరుకోవడంతో బారికేడ్లను ఏర్పాటు చేసి పోలీసులు యువతను ఎక్కడిక్కడ కట్టడి చేశారు. అమ్మవారికి బలి ఇచ్చే దున్నపోతును ఘటంకు ముందుగా నడిపించుకుంటూ తీసుకొచ్చి పూజలు చేశారు. ఐదు రోజుల పాటు గురువారం వరకు ఈ ఘటం పట్టణంలోని అన్ని వీధుల్లోనూ తిరుగుతుంది. ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి, సీఐ ఏవీ రమణ పర్యవేక్షణలతో ఘటోత్సవం కార్యక్రమాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ నెల 10,11 తేదీల్లో జరగనున్న జాతరలో పాల్గొనేందుకు వచ్చిన బంధుమిత్రులతో పట్టణంలో జాతర సందడి నెలకొంది. ఆదివారం సాయంత్రం అట్టహాసంగా జాతర మొదలైంది.

ఘటముకు ద్వితీయ పూజలు

వెంకటగిరి జాతరలో భాగంగా సంప్రదాయాలను దశాబ్దాల కాలంగా కొనసాగుతున్నాయనేందుకు రెండు ఘట్టంలే నిదర్శనం. ఆ రోజుల్లో వెంకటగిరి సంస్థానాధీశుల దగ్గర పనిచేసే తాడిపత్రి వెంకట్రాయులను ఉద్దేశించి ఏమైనా ఆస్తులు, సంపద కోరుకోమంటే ఆయన అందుకు ప్రతిగా పోలేరమ్మ తల్లి జాతరలో ఘటముకు ముందుగా మీ ఇంట తొలి పూజలు నిర్వహించిన అనంతరం మా ఇంట రెండో పూజ జరిగేలా కోరుకోవడంతో అప్పటి నుంచి అదే సంప్రదాయం కొనసాగుతోంది. అనంతరం పట్టణంలో ప్రతి ఇంటా ముంగిటకు ఘటము చేరుకుని పూజలు అందుకుంటుంది.

జాతర కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వరరావు, ఈఓ శ్రీనివాసులరెడ్డి

వెంకటగిరి రూరల్: వెంకటగిరి శక్తి స్వరూపిణి శ్రీపోలేరమ్మతల్లి జాతరను పురస్కరించుకుని ఎస్వీఆర్ చారిటబల్ సొసైటీ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం పోలేరమ్మ తల్లి ఆలయం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈఓ వెంకటశ్రీనివాసులరెడ్డి సమక్షంలో పోలేరమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నక్కా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ సొసైటీ ద్వారా గత 18 ఏళ్లుగా కరపత్రాలను ఆవిష్కరిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, ప్రముఖ న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, సుంకర రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లిరెడ్డి, వెంకటరత్నంరాజు, కసరు రామయ్య, కసరు వెంకటసుబ్బయ్య, చింతగింజల సుబ్రమణ్యం, నందకుమార్, మాడా శ్రీనివాసులు, సుబ్రమణ్యం, శ్రీను, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పోలీస్ అధికారి వెంకటరమణకు సన్మానం

కోట: గతంలో కోటలో ఎస్ఐగా పనిచేసి ప్రజల మన్ననలు అందుకున్న వెంకటరమణ ప్రస్తుతం మాచర్లలో విధులు నిర్వహిస్తూ సీఐగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆదివారం కోటలోని షాదీమంజిల్‌లో అభినందన సభ నిర్వహించారు. పలు దళిత, ప్రజాసంఘాలతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని వెంకటరమణను ఘనంగా సన్మానించారు.

భక్తి శ్రద్ధలతో చండీయాగం



సూళ్లూరుపేట: చండీయాగం నిర్వహిస్తున్న అర్చకులు

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం యాగశాలలో మహా చండీయాగం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ అండ్ కార్యనిర్వహణాధికారి బి ప్రసన్నలక్ష్మీ పర్యవేక్షణలో వేద పండితులు వేదమంత్రోచ్చారణలతో యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాన్ని మధ్యాహ్నం 1గంటకే మూసివేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఆలయశుద్ధి చేసిన అనంతరం దర్శనం కల్పిస్తామని ప్రసన్నలక్ష్మీ తెలియజేశారు.

ముత్యాలమ్మ ఆలయంలో..

చిల్లకూరు: ప్రతి పౌర్ణమిని పురస్కరించుకుని తీర ప్రాంతంలో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో భక్తులు చండీయాగం నిర్వహించడం సంప్రదాయం. అందులో భాగంగా ఆదివారం భక్తులు చండీయాగం నిర్వహించారు. చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం తరువాత ఆలయాన్ని మూసివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ చేసిన తరువాత అమ్మవారి దర్శనం ఉంటుందని ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు.

ఆలయాల మూసివేత

కోట/సైదాపురం/రాపూరు: చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యా హ్నం మండలంలో పలు ఆలయాలను మూసివేశారు. కోటమ్మ దేవస్థానం, గూడలి సంగమేశ్వరాలయం, గూడలికొండపై ఉన్న భీమేశ్వరాలయం, కోటలోని సోమేశ్వరాలయం, వెంకటగిరి పట్టణంలోని పోలేరమ్మ ఆలయం, రాపూరు శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయాలను సోమవారం ఉదయం 8గంటల వరకు మూసివేస్తున్నట్లు అర్చకులు తెలిపారు. సంప్రోక్షణ అనంతరం యథావిధిగా పూజలు, దర్శనం కొనసాగుతుందన్నారు.

ఆ భూముల్లో హెచ్చరిక బోర్డు

కలువాయి(సైదాపురం): మండలంలోని ముక్కుతిప్ప వద్ద 30 ఎకరాల ప్రభుత్వ భూమిని కూటమి నేతలు ఆక్రమిస్తున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఆదివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దాచూరు, కమ్మపాళెం, ముక్కతిప్పకు చెందిన కూటమి నాయకులు ఆక్రమిస్తున్న నేపథ్యంలో స్థానికులు ఈ విషయమై శనివారం తహసీల్దార్ వెంకటేశ్వర్లకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు.

కండలేరులో 41.6 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 41.650 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10,100 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 900, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.


శేషురెడ్డికి ఎమ్మెల్సీ పరామర్శ



శేషురెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ

చిట్టమూరు : మండలానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వూరు శేషురెడ్డిని వారి నివాసంలో ఆదివారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పరామర్శించారు. శేషురెడ్డి ఇటీవల గుండె పోటుకు గురై చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

గంగ కాలువ ఆనకట్ట ఆక్రమణ



కలువాయి(సైదాపురం): మండల కేంద్రంలో తెలుగుగంగ కాలువ ఆనకట్టను ఆక్రమించి, ఇసుక, కంకర, డంపింగ్ యార్డుగా మార్చేస్తున్నారు. ఇటీవల భూముల ధరలు పెరుగుతున్న తరుణంలో ఏకంగా తెలుగంగ కాలువ కట్టనే ఆక్రమించి రేకుల షెడ్డును నిర్మించారు. అయినప్పటికీ ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి కాలువ ఆనకట్ట ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అన్నదాత పోరు పోస్టర్ల ఆవిష్కరణ





గూడూరు: అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయుడుపేట: పోస్టర్ల ఆవిష్కరణలో సంజీవయ్య, నాయకులు

చిల్లకూరు: అన్నదాతకు మద్దతుగా గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. గూడూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్లలో చంద్రబాబు అధికారంలో ఉంటే వ్యవసాయానికి గడ్డుకాలమేనని గుర్తుచేశారు. వ్యవసాయాన్ని నీరుగారుస్తూ కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా రైతుకు మద్దతుగా ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. ఎరువులు, విత్తనాలు బ్లాక్‌మార్కెట్‌కు తరలించడంతో అన్నదాతల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. పట్టణ, రూరల్, కోట, వాకాడు మండలా ల పార్టీ కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, సంపత్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, గూడూరు ఎంపీపీ బూదూరు గుర వయ్య, పట్టణ, రూరల్, కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలకు చెందిన అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వెంకటగిరిరూరల్: రైతులతో కలసి ఈ నెల 9వ తేదీన గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, రూరల్ కన్వీనర్ కాల్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, బాలాయపల్లి మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి ఆదివారం వేరువేరు ప్రకటనల్లో తెలిపారు.

జయప్రదం చేయాలి

డక్కిలి/సైదాపురం/రాపూరు: వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదరుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించనున్న అన్నదాత పోరును జయప్రదం చేయాలని మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులు రెడ్డి, కలువాయి జెడ్పీటీసీ అనీల్ కుమార్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఎం కృష్ణారెడ్డి, రాపూరు మండల కన్వీనర్ బొడ్డు మధుసూదన్‌రెడ్డి ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలియజేశారు.

కూటమి మోసాలను ఎండగడదాం

నాయుడుపేట టౌన్: రైతులకు కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగడదాం అంటూ సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. యూరియా కోసం రైతులు నానా అగచాట్లు పడుతున్నారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 9న సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పార్టీ పరిశీలకులు వీరేంద్ర వర్మ, రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, పెళ్లకూరు జెడ్పీటీసీ ప్రిస్కిల్లా, ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి, ఒట్టూరు కిషోర్ యాదవ్, ఓజిలి, దొరవారిసత్రం, మండల కన్వీనర్లు పాదర్తి హరినాథ్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వేణురెడ్డికి పరామర్శ

పెళ్లకూరు: మండలంలోని చెంబేడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బెల్లపు వేణురెడ్డిని ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పరామర్శించారు. వేణురెడ్డి గత కొన్ని రోజులుగా అనారోగ్య కారణాలతో ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నాడు. సమాచారమందుకున్న సత్యనారాయణరెడ్డి చెంబేడులోని బెల్లపు నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బు వెంకటరత్నం, నాయకులు మండల ఉపాధ్యక్షుడు బెల్లపు వెంకట రాఘవరెడ్డి, మునిరాజ ఉన్నారు.

అంత్యక్రియలకు రూ.2 వేలే ఇచ్చారు

కలువాయి(సైదాపురం): మండలంలోని కేశమనేనిపల్లికి చెందిన అచ్చమ్మ రెవెన్యూ గ్రామ తలారిగా పనిచేస్తూ ఈ నెల 5న మృతి చెందారు. ఆమె అంత్యక్రియలకు గ్రామ రెవెన్యూ అధికారీ హజరత్తయ్య రూ.2వేలు ఇచ్చి వెళ్లిపోయారని, రెవెన్యూ జీఓ ఎంఎస్ 145 ప్రకారం రూ.15వేలు నుంచి రూ.25వేలు వరకు నగదు అందిస్తారని అచ్చమ్మ కుమార్తె పుల్లమ్మ తెలిపారు. ఈ విషయమై వీఆర్‌ఏను ప్రశ్నిస్తే పట్టించుకోకుండా వెళ్లిపోయారని, కలువాయి తహసీల్దార్‌కి ఫోన్ చేసినా స్పందించలేదని ఆమె వివరించారు.

చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి

వెంకటగిరి రూరల్: చేనేతల సమస్యల పరిష్కారానికి శక్తి వంచనలేకుండా కృషి చేయనున్నట్లు 4వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ వీవర్స్ విభాగం అధ్యక్షులు ఎంఏ నారాయణ తెలిపారు. పట్టణంలోని నారాయణ నివాసం వద్ద పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు, చేనేత కార్మికులు ఆదివారం ఆయన్ను శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, విప్ పూజారి లక్ష్మి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కనులపండువగా ఫలాభిషేకం





ఫలాభిషేకానికి హాజరైన భక్తులు, శత స్తంభ కల్యాణ మండపంలో ఫలాభిషేకం చేస్తున్న పురోహితులు

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామంలో ఉన్న శ్రీవల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి ఫలాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శత స్తంభ కల్యాణ మండంలో ఉత్సవమూర్తులైన దేవేరులు విఘ్నేశ్వరుడు, శ్రీవల్లీ, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, చండీకేశ్వరుడు, శివపార్వతుల దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ముందుగా పాలు, నెయ్యి, పెరుగు, తేనెతో దేవేరులకు వేద పండితుల మంత్రోచ్చరణతో అభిషేకం చేశారు. అనంతరం అరటి, బత్తాయి, ఆపిల్, దానిమ్మ, ద్రాక్ష తదితర ఫలాలతో ఆలయ ప్రధానార్చకులు మూలం భాను ప్రకాష్ శర్మ ఫలాభిషేకం శాస్త్రోక్తంగా మయూర ఆగమ శాస్త్రం ప్రకారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి అమ్మవార్లు చందన అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. బ్రహోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలంకణతో శోభాయమానంగా అలంకరించారు. బాణసంచా, మంగళ వాయిద్యాల నడుమ బ్రహోత్సవాలు అరంగరంగ వైభవంగా జరిగాయి. బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించాల్సిన నందిసేవను గ్రహణం కారణంగా సోమవారం తెల్లవారు జామున మూడు గంటలకు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం రథోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలయం.. పుష్పశోభితం







మల్లాం గ్రామంలో స్వయంభువుగా కొలువైన శ్రీవల్లీదేవ సేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పుష్పాలంకరణ భక్తులను ఆకట్టుకుంటోంది. ఆలయం లోపల, వెలుపల పలు రకాల పుష్పాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. - చిట్టమూరు

